

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024 | 5

మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, కీలక నేతలతో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ప్రజాప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జుల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు..


మంత్రి వాసంశెట్టి సుభాష్


ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు


ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం


సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

25 నుంచి పశుగణన

అమలాపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి జిల్లాలో పశుగణన ప్రారంభిస్తున్నట్టు జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. అమలాపురం ఉప సంచాలకుల కార్యాలయంలో శుక్రవారం పశువైద్యాధికారులు, సిబ్బందితో డాక్టర్ నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రతీ ఐదేళ్లకోసారి పశుగణన జరుగుతుందని, ఎటువంటి తప్పులు లేకుండా గణన చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పశుగణన చేపట్టడం ద్వారా పశువులకు ఎన్ని టీకాలు, మందులు అవసరమో తెలుస్తుందని తద్వారా బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయన్నారు. పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనాన్ని పరిశీలిస్తున్న ఐవీ

ముమ్మిడివరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం ఆహార పదార్థాలు అందిస్తున్నారా లేరా అన్న విషయాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో పరిశుభ్రతను పాటించి ఆహార పదార్థాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమేకమయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.హనుమంతరావు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన రిఫ్రిజిరేటర్లు

వేర్వేరు చోట్ల విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

వార్తలు 7లో


సత్యదీక్షలకు వేళాయె

ఈ నెల 27 నుంచి ప్రారంభం

వార్త..7లో

లైట్‌హౌస్ గోడను తాకిన సముద్రపు నీరు

అంతర్వేది, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):



సఖినేటిపల్లి మండలం అంతర్వేది సాగర సంగమం వద్ద లైట్‌హౌస్ గోడలను సముద్ర కెరటాలు తాకుతున్నాయి. సముద్రపు పోటు సమయంలో లైట్‌హౌస్ గోడ చుట్టూ ఈ నీరు చేరడంతో గోడలు చెమ్మగిల్లుతున్నాయి. మరోపక్క సముద్రపు కోతతో తీరప్రాంత భూములు కోతకు గురవుతున్నాయి. అన్నాచెల్లెలు గట్టు, పాత లైట్‌హౌస్ సమీపాన ఇసుక మేటలు ఏర్పడుతున్నాయి. ఇటీవల వచ్చిన ఈదురుగాలుల వర్షాలకు, సముద్రపు పోటు కెరటాల తాకిడికి తీరం వెంబడి ఎక్కడ చూసినా ఉప్పునీటితో నిండుకుని ఉన్నాయి.

అన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



అయినవిల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే అన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు విరాళాలు సమర్పించారు. కాకినాడకు చెందిన నల్లం పరుశురామ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అయినవిల్లి సిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అన్నదాన ట్రస్టుకు తన తండ్రి నల్లం బాలకృష్ణారావు పేరున రూ.1,01,116, తల్లి లక్ష్మీనరసమ్మ పేరున రూ.1,01,116 వెరసి రూ.2,02,232 విరాళాన్ని అందజేశారు. దాతకు ఆలయ ప్రధానార్చకుడు వేదాశీర్వచనం అందించగా ఈవో ముదునూరి సత్యనారాయణరాజు శేషవస్త్రంతో సత్కరించి అభినందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను వారికి అందజేశారు.

సర్వే నంబర్ల వారీగా
రిజిస్ట్రేషన్ విలువ గణించాలి

రైల్వేలైన్ అభ్యంతరాలను పరిష్కరిస్తూ పురోగతి సాధించాలి ● కలెక్టర్ మహేష్‌కుమార్


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216, కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఏర్పాట్ల మూలంగా ఉత్పన్నమైన అభ్యంతరాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దశల వారీగా పరిష్కరిస్తూ పురోగతి సాధించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సర్వే నంబర్ల వారీగా రిజిస్ట్రేషన్ విలువలను గణించాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జాతీయ రహదారులు, రెవెన్యూసిబ్బందితో సమావేశం నిర్వహించారు. రోడ్డు, రైలు మార్గాల అలైన్‌మెంట్‌లో భూములు, గృహాలు కోల్పోయిన నిర్వాసితుల అభ్యంతరాలను సామరస్య పూర్వకంగా పరిష్కరిస్తూ పురోగతి సాధించాలన్నారు. అలైన్‌మెంట్‌లో ఉన్న నిర్మాణాల విలువలను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు లెక్కించాలని, చెట్ల విలువలను ఉద్యానశాఖ అధికారులు గణించాలన్నారు. శివకోడు వద్ద లాకులు దెబ్బతినకుండా అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలన్నారు. గెద్దాడ బరియల్ గ్రౌండ్‌కు ప్రహరీ, అప్రోచ్ రోడ్డుకు అంచనాలు రూపొందించాలన్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌కు సంబంధించి భట్నవిల్లి వరకు అవార్డు పాసైందని, భూములను రైల్వేశాఖకు స్వాధీన పరచాలని ఆదేశించారు. అయినవిల్లి వద్ద 13 కిలోమీటర్ల రైల్వేలైన్ స్థలాలను రైల్వేశాఖకు స్వాధీన పరిచేలా చర్యలు చేపట్టాలన్నారు. భట్నవిల్లి-పేరూరు రైలుమార్గానికి సరిహద్దులు రైల్వే ఇంజనీర్లు, సర్వేయర్ల సహకారంతో ఏర్పాటు చేయాలన్నారు. గుడిమెళ్లంకలో రైలు మార్గానికి భూసేకరణ ప్రారంభించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు కె.మాధవి, శ్రీకర్, కౌశర్ భానో, జాతీయ రహదారుల శాఖ పీడీ సాయిశ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ పెంపకానికి చర్యలు

అనువుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలి ● కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 340 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ పెంపకానికి అనువుగా ఉన్న కేంద్రాలను వెంటనే గుర్తించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. అనువైన కేంద్రాల్లో ఏడాది పొడవునా సీజన్ల వారీగా కిచెన్ గార్డెన్ పెంచేందుకు విత్తనాలు, జీవన ఎరువులు, ఎక్విప్‌మెంట్ పరికరాలను జిల్లా ఉద్యానశాఖ ద్వారా సమకూరుస్తామన్నారు. దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మహిళల సామాజిక, ఆర్థిక సాధికారిత, పిల్లల రక్షణ, అభివృద్ధి కోసం మెరుగైన వసతులను కల్పించాలని లైన్ డిపార్టుమెంట్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖకు సంబంధించిన లైన్ డిపార్టుమెంట్ అధికారులతో మౌలిక సదుపాయాలు, సంపూర్ణ పోషణ వంటి అభివృద్ధి అంశాల పురోగతిపై కలెక్టర్ అధ్యక్షతన మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గుర్తించిన 101 మరుగుదొడ్ల మరమ్మతులను నవంబరుకు పూర్తి చేయాలన్నారు. నూతనంగా ప్రతిపాదించిన 89 మరుగుదొడ్లకు స్థలాలు అందుబాటులో ఉన్నచోట్ల నవంబరు నెలాఖరు నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 248 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతులు కల్పించాల్సి ఉండగా వీటిలో 191 కేంద్రాలకు కొత్తగా తాగునీటి వసతులు కల్పించామన్నారు. అంగన్‌వాడీల సమీకృత శిశు అభివృద్ధి సేవల పథకాల అమలు ప్రక్రియ ద్వారా పోషకాహార లోపాలను సరిదిద్దాలన్నారు. మహిళలు హింస, వివక్ష, వివక్ష లేని వాతావరణంలో జీవించే విధంగా పాటుపడాలన్నారు. బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం బాలికలను రక్షించు.. చదివించు అనే పథకాన్ని తెచ్చిందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.


జాతరకు తరలివచ్చిన భక్తజనం

అంగరంగ వైభవంగా..

అంబాజీపేటలో శ్రీవిజయ భేతాళ ఉత్సవం


దేవతామూర్తుల వాహనాలు



అంబాజీపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అంబాజీపేటలో శ్రీ విజయభేతాళ ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంబాజీపేట అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శ్రీ విజయభేతాళస్వామి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని 13 ప్రాంతాల నుంచి వాహనాలు విద్యుత్ దీపాలతో అలంకరించి సెంటర్లో కొలువుతీరాయి. యువకులు నిర్వహించిన చెడీ తాలింఖానా, కర్రసాము, అగ్గిబరాటాల విన్యా సాలు గగుర్పాటుకు గురిచేశాయి. అంబాజీ పేట నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాలుగు సినీ ఆర్కెస్ట్రాలు ఏర్పాటు చేయడంతో యువకులు ఉత్సాహంతో డ్యాన్సులు వేశారు.

ఆకట్టుకున్న ఉత్సవ వాహనాలు

శ్రీనివాసనగర్, పెచ్చెట్టి వారిపాలెం నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామనగర్ నుంచి శ్రీదుర్గమ్మవారు, దొమ్మేటివారిపాలెం (పాత పోస్టాఫీస్) శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి వద్ద దొమ్మేటివారిపాలెం, పోతాయిలంక నుంచి ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి విజయగణపతి, మాచవరం ఇటీకాలమ్మ గుడి, కొత్తపాలెం నుంచి హంస, చప్పిడి వారిపాలెం నుంచి షిర్డీ సాయిబాబా, గుత్తుల వారిపాలెం నుంచి సింహం, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు, నందంపూడి నుంచి శ్రీ రాజరాజేశ్వరిదేవి వాహనాలు ఈ ఉత్సవంలో కొలువుతీరాయి. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అభ్యుదయ శెట్టిబలిజ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జునమోహనరావు, బొంతు పెదబాబు, విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, గుత్తుల పండు, దొమ్మేటి శ్యామ్ స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు పర్యవేక్షణలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో పలువురు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సందడిగా యువజనోత్సవాలు


ఉత్సవాల్లో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అమలాపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఆవిష్కరణ నేపథ్య పోటీలతోపాటు సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం, జానపద గేయం, కథలు, కవితలు, చిత్రలేఖనం, హస్తకళల పోటీలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలు కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో 821 మంది తమ పేర్లను నమోదు చేసుకుని పోటీలకు హాజరయ్యారు. సెట్రాజ్ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు ఆయా పోటీల విజేతలను ప్రకటించారు. సైన్స్ టెక్నాలజీ ఆవిష్కరణలో ఐ.మధుసాయి, టి.లక్ష్మీశిరీష, జె.మనోజ్ వరుస స్థానాలు సాధించారు. జానపద నృత్యం (బృందం) విభాగంలో పావన్ గ్రూప్ ప్రథమ, వీకేవీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ద్వితీయ, హరిత అండ్ ఏఎస్ఎం కళాశాల తృతీయ స్థానాలు సాధించాయి. సోలో జానపద నృత్యంలో వై.మంజీర ప్రథమ, కుసుమ సౌమ్య, ద్వితీయ, దుర్గామహాకల్యాణి తృతీయ స్థానాలు, జానపద గేయాలు(బృందం) విభాగంలో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ, నవ్య అండ్ గ్రూపు ద్వితీయ, బత్తుల అనూష తృతీయస్థానం సాధించారు. జానపద గేయాలు సోలోలో సిద్ధం శ్రీదేవి, బాబి, పి.చర్మిళదీక్షిత వరుస స్థానాలు సాధించారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ నిషాంతి

డిజిటల్ ప్రచారం





ఆత్రేయపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి 12వ బ్రహ్మోత్సవాలకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రచార మాధ్యమాల ద్వారా స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వానాన్ని భక్తులకు అందించారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో వినూత్న రీతిలో డిజిటల్ ప్రచార హోర్డింగులను ఏర్పాటు చేశారు. అనకాపల్లి నుంచి విజయవాడ వరకు జాతీయ రహదారుల పక్కనే బ్రహ్మోత్సవ హోర్డింగులను ఏర్పాటు చేసి భక్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ముఖ్య ప్రాంతాల వద్ద భారీ ముఖ ద్వారాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు అధికారులకు బ్రహ్మోత్సవ ఆహ్వానాలు పంపించారు.



మంత్రి 'ఆనం'కు ఆహ్వానం

ఆత్రేయపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను మంత్రికి అందజేశారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రికి వివరించారు.



వరదల్లో శబరి బ్రిడ్జి



శబరి బ్రిడ్జి

గిరిజనుల వారధి..

శబరి బ్రిడ్జికి 20 ఏళ్లు!

చంద్రబాబు హయాంలో నిర్మాణం

(కూనవరం - ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆ బ్రిడ్జి కోసం ఎందరో గిరిజనులు కలలు కన్నారు. తమకు వైద్య సేవలందక ఎందరో ఇబ్బందిపడ్డారు. మరికొంతమంది శబరి నదిపై వంతెన లేక వైద్య సేవలందక మృత్యువాత పడిన వారూ ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో వీఆర్ పురం చివరి మండలం. కూనవరం రాగానే మధ్యలో శబరి నది ఉండడంతో వీఆర్ పురం మండలవాసులకు రాకపోకలు స్తంభించేవి. పగటిపూట పడవ నడిపిన రాత్రి పూట పడవ సదుపాయం లేకపోవడంతో ఖమ్మం, భద్రాచలం ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవాళ్లు స్వగ్రామం చేరుకోలేక కూనవరంలోనే రాత్రంతా ఉండవలసి వచ్చేది. తమ కష్టాలు చూసిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2000 సంవత్సరంలో శబరి బ్రిడ్జికి మోక్షం కలిగించారు. శబరి బ్రిడ్జికి ప్రత్యేక నిధులు కేటాయించారు. దీంతో శబరి బ్రిడ్జి పనులు వేగవంతంగా జరిగాయి. తర్వాత 2004లో అప్పటి రోడ్ల భవనాల శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు శబరి బ్రిడ్జిని ప్రారంభించారు. దీంతో వీఆర్ పురం వాసులకు బాహ్య ప్రపంచానికి మార్గాలు ఏర్పడ్డాయి. అంతేకాక విద్యార్థుల చదువుకు, రోగులకు వైద్యం అందేలా శబరి బ్రిడ్జి ఎంతగానో దోహదపడుతోంది. గోదావరి వరదల్లో రెండుసార్లు బ్రిడ్జి పూర్తిగా మునిగినప్పటికీ పటిష్ఠంగానే ఉంది. అంతేకాకుండా వీఆర్‌పురం మండలవాసులు భద్రాచలం నుంచి నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా వైద్యం కావాలన్నా ప్రతీ వరదల సమయంలో అన్ని వేళలా ఉపయోగపడుతోంది. ఈ బ్రిడ్జి 2024 నాటికి 20 ఏళ్లు పూర్తిచేసుకుని ప్రజలకు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తూనే ఉంది.



పరవశించి పోయేలా..

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం - దెబ్బగూడెం మార్గంమధ్యలో శుక్రవారం సాయంత్రం కనువిందు చేసిన దృశ్యం - మోతుగూడెం



బొమ్మల పెళ్లి జరుపుతున్న దృశ్యం

కనుల పండువగా బొమ్మల పెళ్లి

పిఠాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిజజీవితంలో జరిగే వివాహాన్ని తలపించేలా బొమ్మల పెళ్లి జరిగింది. ఈ పెళ్లిని తిలకించేందుకు మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని శిల్పికరణాల వీధిలో ఉన్న పుర్హుతికా అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బొమ్మల పెళ్లి నిర్వహించడం ఆనవాయితీ. ప్రాచీన సంప్రదాయాలను కొనసాగించి అందరికీ తెలియచెప్పడంతోపాటు ఇలా పెళ్లి చేస్తే అందరికి మంచి జరుగుతుందన్న నమ్మకంతో ఈ వివాహ మహోత్సవాన్ని ఏటా మాదిరిగానే శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా పెండ్లికుమార్తెను నార్ల మహంతి సూరిబాబు, సుబ్బలక్ష్మి దంపతులు, పెండ్లి కుమారుడిని పడాల కుటుంబ సభ్యులు ప్రదర్శనగా వివాహ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పెండ్లి కుమార్తె, కుమారుడికి దగ్గరుండి ఏలూరి సూర్యానారాయణ, నాగరత్నం దంపతులు వివాహక్రతువును జరిపించారు. పెళ్లికుమారుడి కాళ్లు కడిగి కన్యాదానం చేయడం, పెండ్లికుమారుడు, కుమార్తెల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచి ముహుర్తానికి పెళ్లి జరిపించడం, సూత్రధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను అర్చకులు నిర్వహింపచేశారు. పెళ్లి అనంతరం విందు కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీషష్ఠ యాగం నిర్వహించనున్నారు.



అతిథుల రాక..



పులసకు బైబై!

- ఏకంగా మూడు నెలలు వరదలు ఉప్పొంగినా జాడ లేని పులసలు
- అక్కడక్కడా దొరికినా ధర వేలల్లోనే
- ఒడిశా విలసలే చెలామణి
- మత్స్యకారులకూ తీవ్ర నిరాశే

పుస్తెలమ్మి అయినా పులస పులుసు తినాలనేది సామెత. గోదారోళ్ల కాస్త ఎటకారం ఎక్కువ.. అందుకే అలా చెబుతారని అనుకోవచ్చుగాని, వాటి ధరలు చూస్తే ఇది నిజమేనని నమ్మక తప్పదు. ఒకటో రెండో దొరికినా కిలో నుంచి రెండు కిలోలలోపు పులస ధర రూ.17 వేల నుంచి 25 వేల వరకు పలుకుతోంది. ప్రస్తుతం పులసల సీజన్ చివరికి వచ్చేసింది. అయినా గోదావరి పరీవాహక ప్రాంతంలో ఈసారి పదుల సంఖ్యలోనే పులసలు దొరికాయి. దశాబ్దం కిందట వందల సంఖ్యలో పులసల వేట సాగేది. గోదావరికి వరద నీరు (ఎర్ర నీరు) తగిలినపుడు ఇతర దేశాల నుంచి బంగాళాఖాతం సముద్రంలోకి వచ్చిన ఈ చేపలు గోదావరిలోకి చేరి ఏటికి ఎదురీదుతాయి. ఆ సమయంలోనే జాలర్లకు చిక్కుతాయి. ఈ పులసకు ఎందుకింత క్రేజు అంటే చేప రుచికన్నా పులుసు రుచి కోసమే పులసప్రియులు ఎగబడతారు. ఇప్పుడు వాటి అడ్రస్ గల్లంతైంది. దాదాపుగా ఇటువైపు రావడం మానేశాయి. ఎందుకు ఇలా మోహం చాటేశాయి...? ఏంటి కథ..?!

(మండపేట- ఆంధ్రజ్యోతి)

ఏటా గోదావరికి వరదలు వచ్చే సమయంలో పులసల జాడ మొదలవుతుంది. సుమారుగా జూలై, ఆగస్టులో రెండు నెలలు ఈ రకం చేపలు దొరకడం జరిగేది. దీన్నే పులసల సీజన్‌గా పరిగణించేవారు. కానీ ఈసారి నుంచి గోదావరికి వరదనీటి తాకిడి అక్టోబరు వరకు కొనసాగడంతో సీజన్ ఇప్పటిదాకా కొనసాగింది. అఖండ గోదావరిలోకి ఎర్రనీరు ముంచెత్తినప్పుడు ఈ అధిక జలాలను ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు సముద్రంలోకి విడిచిపెడతారు. సముద్రంలోకి ఈ గోదావరి తీపినీరు కలిసే సమ యంలో అక్కడున్న విలస చేపలు గోదావరిలోకి ఎదురీదుతూ వస్తాయి. అలా ఉప్పునీటి నుంచి మంచినీటిలోకి ప్రవేశించడంతో అవి పులసలుగా మారిపోతాయి. రుచికరమైన చేపలుగా మారడానికి కారణం ఉప్పునీటి నుంచి తీపి నీటిలోకి రావడమే. రోజులు గడుస్తున్న కొద్దీ వీటి శరీరం మార్పు చెందుతూ ఉంటుంది. ఈ చేపలు ఎక్కువగా గోదావరిలో గుడ్లను పెట్టేందుకే వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతారు. చేప బరువును బట్టి వాటి సంతానోత్పత్తి జరుగుతుంది. కిలో బరువు ఉన్న ఆడ చేప లక్ష గుడ్లను, రెండు కిలో లు ఉండే చేప రెండు లక్షలను పెడుతుంది. సముద్రం నుంచి ధవళేశ్వరం వరకు పులస వలస వెళ్లే సమయంలోనే మత్స్యకారులు గోదావరిలో పులసలు వేట సాగిస్తుంటారు. అది కూడా పులసల వేట కోసం ప్రత్యేకంగా తయారుచేసిన సిల్క్ వలలను మాత్రమే వాడతారు. ఆడచేప సెనతో ఉండడంతో చాలా రుచితోపాటు పులుసు అద్భుతంగా రావడానికి అదే కారణం. కానీ పోతు చేపలకు అంత రుచి రాదు. కానీ మార్కెట్‌లో అన్నీ ఒకటే రకం చేపలుగా విక్రయించేస్తున్నారు. ఈ ఏడాది సీజన్ ముగుస్తున్నప్పటికీ ఇప్పటి దాకా గోదావరిలో దొరికిన పులసలు వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయిలోనే లభ్యమయ్యాయి. దాంతో ఎక్కడైనా చేప దొరికిందంటే కొనుగోలుదారులు వాలిపోతున్నాయి. పాట పెడితే వేలల్లో పాడుకుని సొంతం చేసుకుని ఇతర ప్రాంతాలకు పంపేస్తున్నారు. కానీ స్థానికంగా పులసలు తినే అవ కాశం మాత్రం ఎవరికీ లభించడం లేదు. నిజానికి పులసల సీజన్ వస్తే మత్స్యకారులకు కూడా పంట పండినట్టు ఉండేది. ఎంత వెదికినా వాటి జాడలేకపోవడంతో వారు కూడా నిరాశ చెందుతున్నారు. గోదావరిలోను, అటు సముద్రంలోను కలుషిత జలాల వల్ల పులసలు రావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సాధారణంగా గోదావరిలో పులసల వేట ఇటు ధవళేశ్వరం నుంచి అటు కోనసీమ, యానాం నదీ పరీవాహక ప్రాంతాల వరకు సాగుతుంది. ఇక్కడ లభ్యం అయ్యే పులసలకు మంచి డిమాండ్ ఉంటుంది. రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. కానీ వాటి జాడలేకపోవడంతో పులస రుచి కూడా గత చరిత్రలానే మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. పూర్వం పులసలు జూలై, ఆగస్టు మాసాల్లో మాత్రమే దొరికేవి. ఏటా ఐదు నుంచి ఆరు కోట్ల రూపాయల మేరక వ్యాపారం జరిగేదని చెబుతారు. ఇప్పుడు వరదలు నిన్న మొన్నటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే గోదావరికి వరద నీటి తాకిడి తగులుతూనే ఉంది. దాంతో మూడు నెలలపాటు పులసల వేట సాగించారు. అక్కడక్కడ కిలో, కిలోన్నర చేపలు దొరికాయి. లేదంటే అర కిలో చేపలు ఇప్పటిదాకా దొరుకుతూ వచ్చాయని మత్స్యకారులు తెలిపారు.



ఒడిసా విలసలే చెలామణీ

పులసల జాడ తగ్గిపోయినా, వాటి రుచి చూడాలనే వారి సంఖ్య పెరిగింది. గతంలో ధవళేశ్వరం, ఆత్రేయపురం, బొబ్బర్లంక, కోటిపల్లి, కపిలేశ్వరపురం, పొట్టిలంక తదితర ప్రాంతాల్లో దొరికే పులసలకు మంచి డిమాండ్ ఉంది. తెల్లారేసరికి ఈ చేపల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలుదారులు వాలిపోయేవారు. ఇప్పుడు ఆయా మార్కెట్లలో పులసలు రావడం లేదు. దాంతో ఒడిసాలో విరివిగా దొరికే విలసలను ఇక్కడకు తెచ్చి పులసల పేరుతో విక్రయిస్తున్నారు. ఈ మార్కెట్లలో మాత్రం ఈ రకం చేపలు అమ్మితే మత్స్యకార సంఘం తరఫున పెనాల్టీలు వేస్తారు. దాంతో సమీపంలోనే ఇతర ప్రాంతాల్లో, ధవళేశ్వరం, యానాం ప్రాంతాల్లో ఒడిసా విలసలు విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులైతే వాటిని విలసలుగానే చెప్పి మరీ విక్రయిస్తున్నారు. ధర కూడా రూ.500 నుంచి రూ.1550లోపే సైజును బట్టి దొరుకుతుండడంతో ఏదొకలే అని వాటినే జనం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు వాటి సరఫరా కూడా తగ్గిపోవడంతో మార్కెట్‌లో సీజన్ ముగిసినట్టేనని భావిస్తున్నారు.



చీరమేనుదీ అదే పరిస్థితి..

గోదావరిలో చీరమేను అనే చిరుచేపల సీజన్ నడుస్తోంది. చీరమేను ఆశ్వయుజ మాసంలోనే దొరుకుతుంది. గోదావరి తీరంలో లభ్యమయ్యే ఈ సీరమేనును మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లి చీరలతో వేటాడి బిందుల్లో వేసి మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తారు. శేరులు లెక్కన వీటిని విక్రయిస్తారు. ప్రస్తుతం వీటి ధర అధికంగానే ఉంది. దీపావళి వరకు మాత్రమే చీరమేను లభ్యమవుతుందని మత్స్యకారులు తెలిపారు. యానాం, ఎదుర్లంక, కోటిపల్లి ప్రాంతాల్లో చీరమేను వేట ఎక్కువగా సాగుతుంది. గోదావరి ఒక తెల్లటి తెట్టులాగా కనిపించగానే వేటాడతారు. ఇవి కూడా గోదావరిలో ఎదురీదుకుంటూ ధవళేశ్వరం చేరుకునేసరికి చీరమేను కాస్తా ఇసుక దొందులుగా రూపాంతరం చెందుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇవి దొరకడం కూడా గగనమైపోయిందని వారు వాపోతున్నారు.







చింతూరులో కిక్కాల్ కుసీర్‌ని విక్రయిస్తున్న ఆదివాసీ మహిళ

కిక్కాల్ కుసీర్

ఆ రుచే వేరబ్బ..!

(పచ్చకూర)

చింతూరు, అక్టోబరు 18: కిక్కాల్ కుసీర్ .. చింతూరు ఏజెన్సీలో ఆదివాసీలతోపాటు ఆదివాసేతరులు సైతం ఎంతో ఇష్టంగా తినే ఓ ఆకు కూర ఇది. కుసీర్ అనేది ఆదివాసీ పదం. దీని అర్థం కూర అని. కిక్కాల్ అనేది ఆ ఆకుకూర పేరు. ఇక్కడ జూన్ నుంచి అక్టోబరు వరకు ఈ కూర లభ్యమవుతుంది. బీడు పొలాల్లోనూ, జొన్న, నువ్వు, మినుము, పెసర లాంటి మెట్ట పంట పొలాల్లో ఇది లభ్యమవుతుంది. సహజసిద్ధంగా ఇది మొలుస్తుంది. నాలుగు నుంచి ఎనిమిది ఆకులు వచ్చేంత వరకు వేచి చూసి తర్వాత తెంపుకొని ఈ ప్రాంత వాసులు వండుకొని తింటారు. సహజసిద్ధంగా లభ్యమయ్యే ఈ ఆకుకూరను ఆదివాసీ మహిళలు ఉదయాన్నే తెంపుకొని మార్కెట్‌కు తీసుకొస్తుంటారు. పోగులుగా (కుప్పలుగా) పోసి ఒక్కో పోగును రూ.20కు విక్రయిస్తుంటారు. ఈ కూరను ఇష్టపడేవారంతా పోటీపడి మరీ కొనుగోలు చేయడం పరిపాటి.

● వంటకం ఇలా..

ఒక పాత్రలో తగినంత వంట నూనె వేడి చేసి అందులో వెల్లుల్లిపాయలు, ఎండిమిర్చి, ఉల్లిపాయలు, తాలింపు సామగ్రిని కలిపి వేపుతారు. కొద్దినిమిషాల వ్యవధిలో కడిగి ఆరబెట్టిన ఆకును ఆ తాలింపులో వేసి వంటపాత్ర మూత పెట్టేస్తారు. సుమారు 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో కూర రెడీ అవుతుంది. ఎక్కడ చూసినా వివిధ రకాల ఫెర్టిలైజర్లు, కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగించి పంటలను సాగుచేస్తున్న విషయం విదితమే. ఇది మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెల్సినా తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో సహజ సిద్ధంగా లభ్యమయ్యే ఇటువంటి ఆకుకూరలను తీసుకోవడం ఎంతో మేలన్న భావన ఉంది.





రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలను క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ... క్రీడల పోటీలు

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలి

- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- ఉత్సాహంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు
- వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరు

కాకినాడ అర్బన్, అక్టోబరు 18: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ వివేకానంద పార్కులోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో 68వ అంతర్ జిల్లాల స్కేటింగ్ పోటీలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల విద్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు అండర్-11, 14, 17 విభాగాల్లో పాల్గొంటున్నారు. ముందుగా కలెక్టర్ జాతీయజెండా ఆవిష్కరించగా క్రీడా పతాకాన్ని డీఈవో రమేష్, డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే క్రీడా జ్యోతిని వెలిగించారు. రూరల్ ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రానున్నరోజుల్లో కాకినాడలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించాలన్నారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి జార్జి, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కోశాధికారి రమేష్ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు వి.రవి రాజు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

కాకినాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు శుక్రవారం రాత్రి వరకు ఉత్సాహంగా సాగాయి. మొదటిరోజు 500 మీటర్లు ప్లస్‌డీ విభాగంలో విజేతలను ప్రకటించారు. అండర్-11 బాలికల విభాగంలో.. బాలికల్లో.. గుంటూరుకు చెందిన టి.నాగదుర్గ బంగారం, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మోసా అనికసుశాన్ రజతం, ఆకుల కావ్యశ్రీ కాంస్యం పతకాలు సాధించారు. బాలురలో.. తూర్పుగోదావరికి చెందిన విరోధి రిషేశ్వర్ బంగారం, కోనల వర్షిత్ రజతం సాధించగా విశాఖకు చెందిన కరణం జైచందన్ కాంస్యం పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అండర్-14 విభాగంలో.. బాలికల్లో.. నెల్లూరుకు చెందిన ఆద్విక రమ్య బంగారు పతకం సాధించగా కృష్ణా జిల్లాకు చెందిన టి.తనూజసాయి రజతం, తూర్పుగోదావరికి చెందిన ఉంగరాల హర్షిక కాంస్యం పతకాలు సాధించారు. బాలుర విభాగంలో.. తూర్పుగోదావరికి చెందిన నెల్లూరు నిఖిల్ ఈశ్వర్ బంగారం, కట్టా గగన్ రజతం, కృష్ణాకు చెందిన కె.విఘ్నేష్ కాంస్యం సాధించారు. అండర్-17 విభాగం.. బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన వి.వీరవర్షిణి బంగారం, విశాఖకు చెందిన విద్యాప్రణతి రజతం, నెల్లూరుకు చెందిన ఎస్.జాస్మిత కాంస్యం సాధించారు. బాలుర విభాగంలో.. విశాఖకు చెందిన పి.జాన్సన్ బంగారం, అంబుజూరి లోహిత్‌సాయి రజతం సాధించగా తూర్పుగోదావరికి చెందిన కోట లిఖిత్ కాంస్య పతకం సాధించాడు. అండర్-19 విభాగంలో మహిళల్లో.. చిత్తూరుకు చెందిన కె.స్నేహకృతి బంగారం, కృష్ణాకు చెందిన వి.జాహ్నవి రజతం, పశ్చిమగోదావరికి చెందిన మౌనిక దివ్య కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో.. చిత్తూరుకు చెందిన కె.శ్రీవింద్యన్ బంగారం, కృష్ణాకు చెందిన జశ్వంత్ రజతం, తూర్పుగోదావరికి చెందిన కుసుమ అర్జున్ కాంస్యం సాధించారు. వీరిలో కొంతమందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు.

ఆశ.. నిరాశ..!

పోటీల్లో పాల్గొనకుండానే గాయపడ్డ విద్యార్థిని



కాకినాడఅర్బన్, అక్టోబరు 18: ఒక్కోసారి మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా అనుకోకుండా కొన్ని సంఘటనలు జరుగుతాయి. స్కేటింగ్‌లో పాల్గొని రాణించాలని జిల్లాలు దాటి కాకినాడ వచ్చిన విద్యార్థిని ప్రాక్టీసు చేస్తున్న సమయంలో జారి పడిపోవడంతో చేతికి గాయమైంది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని పి.హైందవి శుక్రవారం కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొనడానికి తోటి విద్యార్థులతో కలిసి వచ్చింది. సాయంత్రం పోటీల్లో పాల్గొనడానికి రింక్‌లో సాధన చేస్తుండగా జారిపడిపోయింది. దీంతో ఆమె ఎడమ చేతికి గాయమైంది. ఎన్నో ఆశలతో పోటీల్లో పాల్గొనాలని వచ్చిన హైందవి ఆశ నిరాశైంది. ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు.





కత్తులవారిపేటలో మహేష్‌బాబు ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ.. మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న చిన్నారితో తల్లిదండ్రులు

చిన్నారి గుండె ఆపరేషన్‌కు మహేష్‌బాబు సాయం

పి.గన్నవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నువ్వు కాపాడిన 3772వ ప్రాణం స్వామి, నువ్వే మా దేవుడని నువ్వు నమ్మే పనిలేదు. మాకు నమ్మించే అక్కరలేదు.. సామీ.. ఇది నిదర్శనం ఇది నిదర్శనం... అంటూ మహేష్ బాబు సినిమాలో ఓ డైలాగ్‌తో ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు పి.గన్నవరం శివారు కత్తులవారిపేట సూపర్‌స్టార్ ఫ్యాన్స్. కత్తులవారిపేటకు చెందిన రెండేళ్ల చిన్నారి రిత్వికకు గుండెకు రంధ్రం పడిందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు నాగాబత్తుల తాతాజీ, జ్యోతి దంపతులు ఆందోళన చెందారు. మహేష్‌బాబు ఫౌండేషన్‌ను ఆశ్రయించగా, సెప్టెంబరు 16న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ జరిగింది. దీంతో గ్రామస్తులు ఇటీవల మహేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీ పెట్టారు.

21న కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న కాకినాడలోని వికాస కార్యాలయం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో జూనియర్ అకౌంటెంట్, ఆఫీసు అకౌంటెంట్, ఫైనాన్సియల్ అడ్వయిజర్, టెక్నీషియన్, టెలీకాలర్, టెలీసేల్స్ రిప్రజెంటేటివ్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7799376111లో సంప్రదించాలని లచ్చారావు ఒక ప్రకటనలో కోరారు.


క్యూ లైన్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఏఈఈ రామకృష్ణ, డీఈ రాంబాబు

అదనపు క్యూ లైన్ల ఏర్పాటుకు చర్యలు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న ప్రారంభమయ్యే కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్యదేవుని సన్నిధికి అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టిసారించారు. ఇందులో భాగంగా శుక్రవారం అదనపు క్యూలైన్లకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. రూ.300 వ్రతం చేయించుకునే భక్తులు, సాధారణ దర్శనం చేసుకునేవారికి స్వామివారి పవళింపు సేవ మందిరం ప్రాంతంలో మరో రెండు అదనపు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అక్కడ ఫ్లోరింగ్ కిందకు ఉండడంతో ఎత్తు చేయించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో డీఈ రాంబాబు పాల్గొన్నారు.

337 గ్రాముల వెండి శంఖం
సత్యదేవునికి బహూకరణ



అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన బొడ్డ వెంకట రామనరసయ్య 337 గ్రాముల వెండితో శంఖం చేయించారు. శుక్రవారం దానిని ఆలయ అధికారి కుచిభొట్ల రాంబాబుకు అందించారు. దాతను ఆయన అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

సభ్యత్వ నమోదులో నాలుగో స్థానంలో 'తూర్పు'

రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన వైసీపీ ప్రభుత్వం

బీజేపీ సభ్యత్వాలపై సమీక్షలో రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. శుక్రవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వాల నమోదులో తూర్పు గోదావరి జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో ఉందని... కార్యకర్తల కష్టం, వారి కృషి ఫలితం గానే ఇది సాధ్యమైందన్నారు. ఆర్థికంగా కుదేలైన రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకోవడానికి కేంద్రం తన వంతు సహకారం అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా సెంట్రల్ ట్యాక్స్ వసూళ్లలో రాష్ట్ర వాటా 42 శాతంలో రెండు నెలలకు కలిపి 7,800 కోట్లు అందించిందన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి కేంద్రం రాష్ట్రానికి 4 వేల కోట్లకు పైగా నిధులు ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు ఐటీఎల పల్లెల్లో రోడ్ల మరమ్మతులకు రూ.700 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారని, కేంద్రం తోడ్పాటుతోనే ఇది సాధ్యమైందన్నారు. వీటితో పాటు అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12,500 కోట్లు కేటాయించిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పోలవరం ఆగిపోయిందని, డయాఫ్రం వాల్ కూడా దెబ్బతిందన్నారు. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడమే కాకుండా దెబ్బతిన్న డయాఫ్రంవాల్ నిర్మాణం కోసం మరో రూ.900 కోట్లు ఇస్తామని కేంద్రం చెప్పిందన్నారు. విశాఖ రైల్వే జోన్ నిర్మాణం త్వరలోనే జరుగుతుందని, ఎయిర్‌పోర్టు విస్తరణ, రాజమహేంద్రవరం ఈస్ట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి, అనపర్తి కెనాల్ రోడ్డును నేషనల్ హైవేగా డిక్లేర్ చేయడం నికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తారనే మాట కాకుండా దాన్ని లాభాల్లోకి ఎలా తీసుకురావాలనే దానిపై కేంద్రం దృష్టిపెట్టిందన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో సభ్యత్వాలు ఇప్పటికే లక్షకు పైగా దాటాయని.. నమోదుకు ఇంకా సమయం ఉన్నందున సభ్యత్వాలు పెరిగేలా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 17 లక్షలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయని, తెలంగాణ కంటే ఏపీలోనే సభ్యత్వ నమోదు బాగుందన్నారు. దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా సభ్యత్వాల నమోదు లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. సమావేశంలో అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, హాకీ, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణారావు, ఎనుముల రంగారావు తదితరులు పాల్గొన్నారు.


ఏకే మల్లవరంలో వివాదానికి దిగిన ఇరువర్గాల ప్రజలు

ఏకే మల్లవరంలో ఇరు వర్గాల మధ్య వివాదం

ఉద్రిక్తత, పోలీసుల మోహరింపు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఏకే మల్లవరంలో చర్చి పాస్టర్ భార్య చనిపోతే అక్కడే ఖననం చేయడం, చర్చి బయట వినాయకుడి ఫ్లెక్సీ ఏర్పాటు, తొలగింపు, ప్రజలు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలను తీసివేయడం వంటి ఘటనలు ఉద్రిక్తతలకు దారితీశాయి. దీనిపై కలిదిండి వీరబాబు, అన్నవరపు వీరబాబు, రాజమహేంద్రపు చంటి తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు వివాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొల్లప్రోలు తహసీల్దార్ సత్యనారాయణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ అక్కడకు చేరుకుని పరిస్థితిని అంచనా వేశారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో పాటు వాదనలకు దిగడంతో సుమారు ఆరు గంటల పాటు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన ఏర్పడింది. బల్లలు ఏర్పాటు చేసేందుకు చర్చి నిర్వాహకులు అంగీకరించలేదు. వాటిపై కూర్చున్న వారు మహిళలను ఏడిపిస్తున్నారంటూ నిర్వాహకులు బెంచీల ఏర్పాటును అడ్డుకున్నారు. ఇరువర్గాలతో చర్చించి అక్కడ బెంచీలు ఏర్పాటు చేశారు. ఇరువర్గాలు సంయమనంతో ఉండాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాలతో తహసీల్దార్, ఎస్ఐలు చర్యలు జరిపి శాంతి కమిటీని ఏర్పాటు చేశారు.


శాంతి కమిటీ ఏర్పాటుపై చర్చిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

జీజీయూలో జనవరి 8 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

రాజానగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా వైభవాన్ని దశదిశలా మరింత చాటిచెప్పేలా ప్రపంచ తెలుగు మహాసభలను 2025 జనవరి 8, 9, 10 తేదీల్లో జీజీయూ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జీజీయూ ఏర్పాటుచేసిన సమావేశంలో ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ పూర్తి బాధ్యతలను చైతన్య సంస్థలే చేపడుతున్నట్టు చెప్పారు. దీనికి ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, హైకోర్టు న్యాయమూర్తులు, సినీ తారలు, కేంద్ర మంత్రులు హాజరవుతారన్నారు. ప్రాంగణంలో నన్నయ్య భట్టారక వేదిక, రాజరాజనరేంద్ర వేదిక, కందుకూరి వీరేశలింగం అనే పేర్లతో మూడు ప్రధాన వేదికలు ఏర్పాటు చేస్తామన్నారు. పలువురు ప్రముఖులకు సత్కారాలు, విశిష్ట పురస్కారాలు అందజేస్తామని సత్యనారాయణరాజు చెప్పారు. పద్య పఠనం, గద్య పఠనం, అవధానాలు జరుగుతాయన్నారు. సంగీత వర్క్‌షాపు మణిశర్మ, పాటల సాహిత్య ప్రసిద్ధ రచయిత అనంతశ్రీరామ్, కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. సమావేశంలో జీజీయూ ఉప కులపతి యు.చంద్రశేఖర్, సాహిత్యవేత్తలు విశ్వనాథ గోపాలకృష్ణ, యర్రాప్రగడ రామకృష్ణ, సప్పా దుర్గాప్రసాద్, పీడీవీ సంజీవరావు, విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ రసీదు వ్యవహారంపై ఫిర్యాదు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో భక్తుడికి సత్రం గది కేటాయింపునకు సంబంధించి నకిలీ రసీదు అందించిన వ్యవహారంపై శుక్రవారం దేవస్థానం సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరి పేర్లు ప్రస్తావించకుండా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక కాంట్రాక్టు ఉద్యోగి, ఒక రెగ్యులర్ ఉద్యోగి పాత్ర ఉన్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

సత్య దీక్షకు వేళాయె...

- ఈ నెల 27న ప్రారంభం
- నవంబరు 6న 8 రోజుల దీక్ష
- 14న తొమ్మిది రోజుల దీక్ష
- 23న ఇరుముడి సమర్పణ



అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న సత్యదేవుని దర్శనం చేసుకుంటేనే ఎంతో పుణ్యఫలంగా భక్తులు విశ్వసిస్తారు. అటువంటిది ఎంతో నియమ, నిష్ఠలతో 27 రోజుల పాటు సత్యదీక్ష చేపడితే మరింత పుణ్యఫలం లభిస్తుందని ప్రగాఢ విశ్వాసం. అయ్యప్ప, భవానీ దీక్షల మాదిరిగా అన్నవరం సత్యదేవుని దీక్ష బహుళ ప్రాచుర్యం పొందింది. ఆశ్వయుజ మాసంలో మఖ నక్షత్రం రోజున ప్రారంభమయ్యే సత్యదీక్ష కార్తీక మాసంలో మఖ నక్షత్రం రోజున ఇరుముడి సమర్పణతో ముగుస్తుంది. ఈ ఏడాది సత్యదీక్షలు అక్టోబరు 27న ప్రారంభమవుతాయి. మొదట్లో 27 రోజుల దీక్షను ప్రవేశపెట్టగా కాలక్రమంలో మహిళలను దృష్టిలో ఉంచుకుని 18 రోజులు, 9 రోజులు అమలు చేశారు. సత్యదీక్ష ఎప్పుడు తీసుకున్నా ఇరుముడి సమర్పణతో కార్తీక మాసంలో మఖ నక్షత్రం రోజునే ముగుస్తుంది.

27 రోజుల దీక్ష అక్టోబరు 27న, 18 రోజుల దీక్ష నవంబరు 6న, తొమ్మిది రోజుల దీక్ష నవంబరు 14న ప్రారంభమవుతాయి. నవంబరు 23న విరమించాలి. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా గిరిజనులతో దీక్ష ఇప్పిస్తున్నారు. వారికి దేవస్థానం తరఫున దీక్షా వస్త్రాలు, మాలలు ఉచితంగా అందిస్తారు. ఈ ఏడాది 600 మంది గిరిజనులకు దీక్షా వస్త్రాలు ఇచ్చారు.

నియమావళి

- సత్యదీక్షాధారులు పసుపు రంగు వస్త్రాలు ధరించాలి.

తెల్లవారుజామున లేచి సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికిముందు చన్నీటితో శిరస్నానం చేయాలి.
- దీక్షాకాలంలో ప్రతి ఒక్కరినీ సత్యదేవ స్వరూపులుగా భావించి మగవారిని సత్యదేవ, ఆడవారిని సత్యగా సంబోధించాలి. తల్లిదండ్రులు, గురువులను, పెద్దలను గౌరవించి సేవించాలి.
- దీక్షాకాలం ఎల్లవేళలా విభూతి, కుంకుమ బొట్టు ధరించి సత్యదేవాయ నమః అంటూ స్మరించాలి. మాలలు ఏట్టి పరిస్థితుల్లో నేలకు తాకకుండా చూసుకోవాలి. ఒకపూట ఆహారం భుజించి రెండవపూట అల్పాహారం తీసుకోవాలి. మాంసాహారం, ఉల్లి, ఎటువంటి మసాల దినుసులు ఉపయోగించని ఆహారమే భుజించాలి.
- పూజ, భిక్ష, భజన సమయాల్లో చొక్కాలు ధరించరాదు.

త్రికరణ శుద్ధిగా బ్రహ్మచర్యం పాటించి నేలపై కొత్త చాప, కొత్త దుప్పటి వేసుకుని విశ్రమించాలి.
- పాదరక్షలు ధరించడం, పొగ తాగడం, క్షౌరం చేయించుకోవడం, మద్యం సేవించడం, జూదం ఆడడం వంటి చేయకూడదు. బహిష్టు అయిన మహిళలను చూసినా, శవమును చూసినా వెంటనే స్నానమాచరించి ఇంటికి చేరుకోవాలి. సత్యముసే పలుకుతూ గురుస్వాముల మాటలను మిక్కిలి ఆజ్ఞగా భావించాలి.
- దీక్షలను వారి స్వగ్రామాల్లోని ఆలయాల్లో స్వీకరించినా సత్యదేవుని సన్నిధిలో ఇరుముడి సమర్పణతోనే విరమించాలి.


గిరిజనులకు దీక్షావస్త్రాలను ఉచితంగా అందజేస్తున్న అన్నవరం దేవస్థానం అధికారి

దేశకీర్తిని ఇనుమడింపజేస్తా

అండర్-17 స్విమ్మింగ్ భారత జట్టు సభ్యుడు మణికంఠ... ఈజిప్ట్ ఈత పోటీల్లో భారతకు కాంస్యం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠ నవీన్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18: భారతదేశ కీర్తిని ఇనుమడింపజేస్తానని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన స్విమ్మింగ్ క్రీడాకారుడు మణికంఠనవీన్ పేర్కొన్నాడు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మణికంఠ మాట్లాడుతూ ఐటీవల ఈజిప్ట్ దేశంలో జరిగిన అండర్-17 స్విమ్మింగ్ పోటీల్లో భారత జట్టు కాంస్య పతకం సాధించిందని, ఆ జట్టులో తాను సభ్యుడిగా ఉన్నానన్నారు. తాను ఈజిప్ట్ వెళ్లి పోటీల్లో పాల్గొనేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపాడు. కోచ్ గ్రంధి రవితేజ్ ఇచ్చిన సూచనలు, సలహాలు ఎంతో తోడ్పడ్డాయన్నాడు. త్వరలో జరిగే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనాలనేది తన కోరిక అని... రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తే మరింత కష్టపడి పతకం సాధించేందుకు కృషి చేస్తానని మణికంఠ చెప్పాడు. విలేకరుల సమావేశంలో నవీన్ తండ్రి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లోపభూయిష్టం

- బీజేపీ సహా అన్ని పార్టీలకు ముడుపులు ఇచ్చిన 'మెగా' సంస్థ
- సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి
- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 18: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లోపభూయిష్టంగా జరుగుతోందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వైసీపీలకు మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ కోట్లాది రూపాయల ముడుపులు ఇచ్చిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఎన్నో ఆరోపణలున్నా ఎంతమంది కంపెనీకే ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను తిరిగి అప్పగించడాన్ని తప్పుబట్టారు. డయాఫ్రం వాల్ నిర్మాణంలో జరిగిన లోపాల వల్ల వాల్ కొట్టుకుపోయిందని కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అయ్యిందన్నారు. దీనికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. సంబంధిత ఇంజనీర్లు, ముఖ్యమంత్రులను బాధ్యులుగా చేస్తారా అని నిలదీశారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పోలవరం ప్రాజెక్టు టెండర్లను పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ప్రాజెక్టు టెండర్లు పిలవాలని, డబుల్ డయాఫ్రంవాల్ నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారం పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రికి లేఖ రాస్తున్నానన్నారు. తాను ఏ రాజకీయ పార్టీకీ చెందినవాడను కాదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పారదర్శకంగా జరిగే వరకు పోరాడతానని హర్షకుమార్ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

ఆధునిక సాంకేతిక అంశాలపై వృత్తిపరమైన అవగాహన పొందాలి

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, అక్టోబరు 18: కాకినాడ జేఎన్టీయూ యూనివర్సిటీ సీఎస్‌ఈ విభాగంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐ, ఎంఎల్ ఆధ్వర్యంలో 'ఇండస్ట్రీ 4.0' అంశంపై రెండు రోజుల పాటు జరిగే ఎఫ్‌డీపీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విరివింద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు పాల్గొన్నారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం ఆదరణలో ఉన్న ఏఐ, ఎంఎల్, ఐఓటీ, డేటా సైన్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఏఆర్, వీఆర్ కోర్సుల పరిశ్రమలకు అనుగుణంగా అధ్యాపకులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ఆధునిక సాంకేతిక అంశాలపై వృత్తిపరమైన అవగాహన పొందాలన్నారు. సీఎం చంద్రబాబు జేఎన్టీయూ ఇండస్ట్రీ రెడీ కోర్సులకు సంబంధించిన ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు సమన్వయకర్తలను అభినందించారు. రిసోర్సుపర్సన్లుగా డాక్టర్ కేఎస్ కృష్ణ, డాక్టర్ వల్లభరావు వ్యవహరించగా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ మోహన్‌రావు, కరుణ, చక్రవర్తి, శివరామకృష్ణ, డీఈ పద్మజారాణి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అస్మాగో పరిశ్రమకు వ్యతిరేకంగా...


22 నుంచి సామూహిక నిరవధిక దీక్ష

కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి శివగణేష్

గోకవరం, అక్టోబరు 18: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్మాగో ఇథనాల్ ఆల్కహాల్ జల, వాయు, శబ్ద కాలుష్య కారక పరిశ్రమ నిర్వాహకుల వ్యతిరేకంగా గ్రామంలో ఈ నెల 22వ తేదీ నుంచి సామూహిక నిరవధిక దీక్ష చేపట్టనున్నట్టు కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా గ్రామాలకు అతి, జనావాసాల మధ్యలో ఇథనాల్ పరిశ్రమ నిర్మించారన్నారు. నిర్మాణ ప్రారంభం నుంచి పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన చెందారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, 20 రోజుల్లో ఈ వ్యవహారాన్ని చక్కదిద్దుతామని యాజమాన్యం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరిన గడువు పూర్తయినప్పటికీ సమస్యకు పరిష్కారం మాత్రం చూపలేకపోయారన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమను మూసివేయాలని కోరుతూ ఈ నెల 22న దీక్ష చేపట్టనున్నట్టు శివగణేష్ చెప్పారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

ఇంట్లో రిఫ్రిజిరేటర్ రిపేర్ చేస్తుండగా ఒకరు...


నాగవెంకటశేషాద్రి (పాత చిత్రం)

ముమ్మిడివరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాజోలంకలో విద్యుత్ షాక్ గురై ఓ వ్యక్తి మృతి చెందారు. రాజోలంకకు చెందిన టీడీపీ నాయకుడు సుందరపల్లి నాగ వెంకటశేషాద్రి (50) తన ఇంట్లో రిఫ్రిజిరేటర్‌కు మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్ గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అతడిని ముమ్మిడివరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మోటారు సైకిల్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్న శేషాద్రికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆతడి ఆకస్మిక మృతితో జీవనాధారం కోల్పోయామని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్తారింట్లో రిఫ్రిజిరేటర్ శుభ్రం చేస్తుండగా మరొకరు...


నాగరాజు (పాత చిత్రం)

ఉప్పలగుప్తం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్తారింటికి వచ్చిన అల్లుడు మృత్యువాత పడడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంకకు చెందిన కొప్పాడి నాగరాజు (29) రెండు రోజుల క్రితం ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్పలోని అత్తగారి ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం ఇంట్లో రిఫ్రిజిరేటర్ శుభ్రం చేస్తుండగా కరెంట్ షాక్ గురయ్యారు. అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. వివాహమైన ఏడేళ్లకే భర్త మరణించడంతో భార్య జయలక్ష్మి విలపించిన తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

పిఠాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని పిఠాపురం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో సత్యనారాయణ గెడ్డ వద్ద మేడిశెట్టి రామకృష్ణ తన అన్నయ్య బాల్యింకిత ఈనెల 16వ తేదీ సాయంత్రం గొడవపడ్డారు. అది చూసిన పసుపులేటి శ్రీనివాస్ వారిని అడ్డుకున్నాడు. తన అన్నకు మద్దతుగా వస్తున్నాడన్న కోపంతో శ్రీనివాస్‌పై కత్తితో దాడి చేయగా తప్పించుకున్నాడు. దీంతో శ్రీనివాస్ స్కూటీపై పెట్రోల్ పోసి దహనం చేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు పాల్పడిన రామకృష్ణను శుక్రవారం అతడి ఇంటి వద్ద అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సాయిఆశ్రిత

అయినవిల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి విద్యా వైభవ్, మంథన్ మండల్ పోటీల్లో ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మానేపల్లి సాయిఆశ్రిత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు తెలిపారు. డీఈవో కమల కుమారి చేతులమీదుగా ఆశ్రిత ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నారు. ఆశ్రితను సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, విద్యా కమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, ఉపాధ్యాయులు అభినందించారు.



తూర్పుపాలెం సభలో మాట్లాడుతున్న దేవ వరప్రసాద్

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ టీచర్స్ ధర్నా

ముమ్మిడివరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ జిల్లాలోని మున్సిపల్ ఉపాధ్యాయులంతా ముమ్మిడివరంలో ధర్నా, రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. జిల్లాలోని మున్సిపల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మిడివరం డీఈవో కార్యాలయం ఎదుట శిబిరాన్ని ఏర్పాటు చేసి ధర్నా నిర్వహించి రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. మున్సిపల్ పాఠశాలల్లోని పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, నవంబరులోపు అప్‌గ్రేడ్ పోస్టుల్లో ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. మున్సిపల్



ధర్నా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

హైస్కూల్స్‌లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులను బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. మున్సిపల్ టీచర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ధర్నా శిబిరాన్ని డీఈవో కార్యాలయ ఏడీ సురేష్‌కుమార్ సందర్శించగా ఉపాధ్యాయులు వారి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, టి.విజయకృష్ణ, పి.సురేంద్రకుమార్, రాయుడు శ్రీనివాస్, టి.దుర్గాప్రసాద్, పి.మురుగేశ్వరరావు, బి.చంద్రకళ, కె.శ్రీనివాస్, కేజీకే రెడ్డి, జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ, అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపల్ ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల నిరసన

అమలాపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీతాల బకాయిలు చెల్లించాలంటూ అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం వద్ద మున్సిపల్ క్యాబ్ డ్రైవర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు నిలిచిపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కె.సత్తిబాబు పేర్కొన్నారు. నిరసనలో అరుణకుమార్, మురళీ పాల్గొన్నారు.

రావూరి భరద్వాజ వర్ధంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల సంక్షేమ సేవాసంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ కార్యాలయంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ వర్ధంతిని నిర్వహించారు. భరద్వాజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబిరావు, కముజు సుందరరావు, కుడుపూడి గోపాలకృష్ణ, ఎం.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

అంబాజీపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి శనివారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. 19న ముక్కామల, 21న పశుపల్లి, 22న వక్కలంక, 23న మొసలపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. భూముల విషయంలో జరిగిన రీసర్వేలో అభ్యంతరాలు, తేడాలు, ఇతర ఇబ్బందులపై దరఖాస్తు చేసుకోవాలనితహసీల్దార్ సూచించారు.

పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి



అయినవిల్లిలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రహదారులు ధ్వంసమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా చేస్తుందన్నారు. నల్లచెరువులో రూ.25లక్షలు, నేదునూరు రూ.33 లక్షలు, మడుపల్లె రూ.10.50 లక్షలు, చింతనలంక రూ.10 లక్షలు, వెలువలపల్లి రూ.5 లక్షలు, అయినవిల్లి రూ.21.50 లక్షలు, అయినవిల్లిలంక రూ.15 లక్షలు, వీరవల్లిపాలెంలో రూ.26లక్షలు వ్యయంతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీ బెహరా, సర్పంచ్‌లు గుమ్మడి ప్రసాద్, సలాది బుచ్చిరాజు, కాకర శ్రీనివాస్, నిమ్మకాయల సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, మండల జనసేన అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, కళ్లేపల్లి సుబ్బరాజు, సయ్యపురాజు సత్యనారాయణరాజు, సలాది పుల్లయ్యనాయుడు, విళ్ల నవీన్, తోట సుబ్బారావు, గుద్రాల రాంబాబు, మేడిద దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రంకిరెడ్డి కాశీవిశ్వనాథంను సన్మానిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి చెప్పారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల జిల్లా జట్లు ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు మెట్ల రమణబాబు మాట్లాడుతూ క్రీడాకారులు సాత్విక్‌సాయిరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇదే క్రీడా ప్రాంగణంలో ఓనమాలు దిద్దుకున్న సాత్విక్‌సాయిరాజ్ అర్జున అవార్డు, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డులను సాధించి అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదిగాడని కొనియాడారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీలతో కలిసి రమణబాబు ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అడబాల విజయ్‌శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ జిల్లా కార్యదర్శి బీఎస్ఎన్ మూర్తి, రామారావు, గణేశ్వరరావు, ఈశ్వరరావు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, ఉంగ్రు ముసలయ్య, వైఎస్వీ రమణారావు, తోట రవి, కామన మధు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్డీవో



అమలాపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పది రోజులుగా బండారులంకలో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా పేరుకుపోతుండడంతో అమలాపురం ఆర్డీవో మాధవి అధికారులతో కలిసి శుక్రవారం గ్రామంలో పర్యటించారు. గతంలో స్థానిక శివాలయం సమీపంలోని శ్మశానవాటిక ప్రాంతంలో లోయర్‌కౌశిక డ్రెయిన్‌ను ఆనుకుని ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డు ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో చెత్త సేకరణ పనులు పంచాయతీ నిలిపివేసింది. సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో స్థానికులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనువైన స్థలం ఏదైనా ఉందా అని ఆరా తీశారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తామని ఆర్డీవో తెలిపారు. డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు, తహసీల్దార్ కిశోర్‌బాబు, ఎంపీడీవో ఉంగ్రు బాబ్జీరాజు, ఈవోపీఆర్డీ డి.మంగాదేవి, కార్యదర్శులు కోరుమిల్లి శ్రీనివాస్,రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు పాల్గొన్నారు. చెత్త పేరుకుపోవడంతో ప్రజారోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని సర్పంచ్ సునీత అధికారులదృష్టికి తీసుకువచ్చారు.

గోడితిప్ప యూపీ స్కూలు అభివృద్ధికి చర్యలు

అల్లవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గోడితిప్ప యూపీ స్కూలు అభివృద్ధికి మధ్యాహ్న భోజన పథకం సక్రమ అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు కమిటీ చైర్మన్ కొల్లు వేణుగోపాల్ అన్నారు. ఆయన అధ్యక్షతన గోడితిప్ప యూపీ స్కూల్‌లో సమావేశం జరిగింది. సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి, కొల్లు త్రినాథవర్మ తదితరులు ప్రసంగించారు. అడబాల సత్యనారాయణ, వనలక్ష్మి జ్ఞాపకార్థం రూ.6వేల విలువైన కుర్చీలను స్కూల్‌కు అందజేశారు. బసవా శేషాంబ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ఉప్పలగుప్తం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): భూమిరీసర్వే జరిగిన గ్రామాల్లో అభ్యంతరాలపై రైతుల వినతులస్వీకరణకు ఈనెల19 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వీఎస్ దివాకర్ తెలిపారు. 19న సన్నవిల్లి, 21న కూనవరం, 22న చినగాడవిల్లి, 23న నంగవరం, 24న విలసవిల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఉదయం10నుంచి మధ్యాహ్నం 1గంటవరకు సభలు నిర్వహిస్తామన్నారు.

మద్యం షాపు తొలగించాలని ఫిర్యాదు

అల్లవరం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అల్లవరంలో నివాస గృహాలు, రామాలయం పక్కన ఏర్పాటు చేసిన నూతన మద్యం షాపును తొలగించాలని తహసీల్దార్, ఎక్సైజ్ అధికారులకు పలువురు ఫిర్యాదుచేశారు. మద్యం షాపులు తొలగించకుంటే ఆందోళన చేస్తామని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎంపీపీని కలిసిన ఎంపీడీవో



రాజోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజోలు ఎంపీడీవోగా డి.రాం బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.బాలాజీ మలికిపురం మండ లానికి బదిలీపై వెళ్లారు. ఎంపీడీవో రాంబాబుకు ఏవో ఎం.సత్యనారాయణ, సెక్రటరీలు, సిబ్బంది అభినందనలు తెలిపారు. తాటిపాకలో ఎంపీపీ కేతా శ్రీనును ఎంపీడీవో డి.రాంబాబు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మండల అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఏవో ఎం.సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



కాట్రేనికోన, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి గ్రంధి నారాయణమూర్తి ఇంటి ఆవరణలో గురువారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. ఈపుష్పం అందరినీ ఆకట్టుకుంది.

సమన్వయంతో ముందుకెళ్లాలి

మలికిపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): క్యాడర్ సమన్వయంతో కూటమి ధర్మాన్ని పాటించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. గొల్లపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి, గుడిమెళ్లంక, మేడిచర్ల పాలెం గ్రామాల్లో శుక్రవారం జరిగిన పల్లెపండుగ కార్యక్రమాల సందర్భంగా గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ స్ఫూర్తికి విఘాతం కలిగించవద్దని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లను ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో ముందుకు వెళ్లాలని సూచించారు. తూర్పుపాలెంలో రూ.4.50కోట్లతో వంతెన నిర్మించారని, వాటి అప్రోచ్ విషయంలో ఎవరో కోర్టుకు వెళ్తే అది ప్రజల దురదృష్టమా అని ప్రశ్నించారు. నాయకులు నిర్లక్ష్యంగా ఉంటే అది కేన్సర్ కంటే ప్రమాదమన్నారు. వారం రోజుల్లో తూర్పుపాలెం వంతెనపై ఆటంకం కల్పించిన వ్యక్తులతో స్థానిక నాయకులు మాట్లాడాలని చెప్పారు. ఆయా గ్రామాల్లో పలు రహదారులకు శంకుస్థాపనలు చేశారు.మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు,మంగెన భూదేవి, సర్పంచ్‌లు మందపాటి నాగేశ్వరరావు, గుర్రింక సత్యనారాయణ, యెనుముల నాగు, నల్లి విజయకుమారి, మేడిచర్ల వల్లీశ్వరి, మంగెన భూదేవి, మట్టా అనంతలక్ష్మి, అడబాల సాయిబాబు, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, కె.కనేశ్వరరావు, గుబ్బల శ్రీనివాస్, ఎంపీడీవో బాలాజీ, తహసీల్దార్ శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

భేతాళస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గిడ్డి



విజయభేతాళస్వామి ఉత్సవంలో కత్తులతో సందడి చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): అంబాజీపేటలో శెట్టిబలిజ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవిజయభేతాళస్వామి ఉత్సవంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చెడీ తాలింఖానా కత్తులతో సందడి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నగర్‌లోని భేతాళస్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవం నిర్వహిస్తున్న పలు వాహనాలను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు గణపతి వీరరాఘవులు, దొమ్మేటి రామారావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, శీలం మోహనరావు, దొమ్మేటి సాయికృష్ణ, కొర్లగోపి గోపి, బొంతు పెదబాబు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్ల నిరసన

రాజోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల మనుగడ దెబ్బతినే విధంగా ఎల్ఐసీ మేనేజ్‌మెంట్ ఐఆర్డీఏ తీసుకున్న నిరంకుశ విధానాలపై ఆలిండియా ఇన్సూరెన్సు ఏజెంట్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు రాజోలు ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్లు శుక్రవారం నిరసన తెలిపారు. ఏజెంట్ల ఐక్యత వర్ధిల్లాలి, లియాఫీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా రాజమహేంద్రవరం డివిజనల్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ మాలే నాగబాబు మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి కడలి వేణుగోపాలకృష్ణ, కోశాధికారి రావి విజయ్, విత్తనాల ప్రసాదరావు, పి.వెంకటేశ్వరరావు, తోలేటి రాంబాబు, కె.వీరాంజనేయులు, బి.శ్రీనివాసరావు, వీబీటీ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలో షాపులను కొనసాగించాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సర్క్యులర్ బజార్‌లోని షాపుల అద్దె పెంపు విషయంలో ఎటువంటి మార్పు లేకుండా పాత పద్ధతి ప్రకారం కొనసాగించాలని కోరుతూ శ్రీపొట్టి శ్రీరాములు సర్క్యులర్ బజార్ వర్తక సంఘ వ్యాపారులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణికి వినతిపత్రాలు అందజేశారు. ప్రతీ మూడేళ్లకోసారి 33.3 శాతం అద్దె పెంపుతో పాటు 18 శాతం జీఎస్టీని కలపడంతో వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు జనిపిరెడ్డి సురేష్, కార్యదర్శి మలకా రాజేశ్వరరావు, కోశాధికారి తాడి రవి పాల్గొన్నారు.

విజయభేతాళస్వామికి వెండి శఠగోపం బహూకరణ

అంబాజీపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట శ్రీనివాస్‌నగర్‌లో కొలువుదీరిన విజయభేతాళ స్వామివారికి కుడుపూడి రామ్మోహనరావు-అనంతలక్ష్మి దంపతుల కుమారుడు నాగవిజయరాజా-స్వర్ణలత దంపతులు రూ.60వేలు విలువైన వెండి శఠగోపం, వెండి పళ్లాన్ని శుక్రవారం బహూకరించారు. విజయభేతాళస్వామి ఉత్సవం సందర్భంగా వీటిని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

క్రీడల్లో రాణించాలి: మల్లాడి



యానాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రంలోని మాహే రీజియన్‌లో జరిగే క్రీడా పోటీల్లో యానాం విద్యార్థులు రాణించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులతో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. అండర్-17 కేటగిరిలో బాలికలు 12మంది, వాలీబాల్, టేబుల్ టెన్నిస్‌లో 24మంది, ఫుట్‌బాల్‌లో 18మంది విద్యార్థులకు స్పోర్ట్సు కిట్లను మల్లాడి అందజేశారు. వారు ఈనెల23న మహేకు బయలుదేరివెళ్లారు. అక్కడ విద్యార్థులకు భోజన సదుపాయాన్ని మల్లాడి ఏర్పాటు చేస్తారు.

పోలీసుల ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

కాట్రేనికోన, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు కాట్రేనికోన పోలీసులు తెలిపారు. పోలీసుల త్యాగాలు, ఉద్యోగ జీవితంలో వారు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను కళ్లకు కట్టేలా చక్కని సందేశాత్మక చిత్రాలు గీసి ఈనెల21వతేదీలోగా పోలీసు స్టేషన్‌లో అందించాలని కోరారు. విజేతలకు 21న ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందిస్తామన్నారు.

వెంకటన్‌నగర్‌లో అన్నసంతర్పణ

యానాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యానాం వెంకటన్‌నగర్‌లో దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. గ్రామప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈగా పవన్‌కుమార్



కాట్రేనికోన, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అయినాపురం సెక్షన్ ఇరిగేషన్ ఏఈగా ఎన్‌వీవీఎస్ పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన పోలవరం ప్రాజెక్టులో పనిచేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

రెయిన్‌గేజ్ మీటర్ పనితీరు పరిశీలన

అమలాపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో అమర్చిన ఆటోమెటిక్ రెయిన్ గేజ్‌మీటర్ పనితీరును ట్రాన్స్‌కో అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజబాబు, కార్యనిర్వాహక ఇంజనీర్ రవికుమార్, డివిజనల్ ఇంజనీర్ విజయానంద్ ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఉప్పలగుప్తం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు బీరమేను సత్తెమ్మ(115) శుక్రవారం మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, అయిదుగురు కుమార్తెలు ఉన్నారు. 25మంది మనుమలు, మనుమరాళ్లు, 30మంది మునిమనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. ఇప్పటివరకు ఏ అనారోగ్య సమస్యలు లేకుండా ఆమె ఆరోగ్యంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండపేటలో వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం పలు హోటళ్లు, వ్యాపారసంస్థలు, స్వీట్‌స్టాల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, శానిటరి మేస్త్రీలు చుండ్రు రామకృష్ణ, పాలపర్తి ప్రసాద్, సందక మహేష్ వెంకట్రావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో తాపేశ్వరం బాపనమ్మ చెరువు

- ఐదెకరాల చెరువుకు మిగిలింది ఎకరంన్నర మాత్రమే
- చెరువు చుట్టూ పక్కా భవనాలు
- ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు నిర్మాణంతో రూపుకోల్పోయిన చెరువు




బాపనమ్మ చెరువు ఆక్రమణలకు గురైన దృశ్యాలు



బిల్డింగ్ నిర్మాణం

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు ఆదాయం ఇవ్వటం, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించే పంచాయతీల చెరువులు గ్రామాల్లో ఆక్రమణల్లో చిక్కి చెరువు రూపం కోల్పోతున్నాయి. చెరువులు వేలం ద్వారా పంచాయతీ ఆదాయం చేకూరటంతో పాటు గ్రామంలో పశువుల దాహార్తిని తీర్చే చెరువులు కొంత కాలానికి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే ఆక్రమణలదారులకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాపేశ్వరం పంచాయతీకి చెందిన బాపనమ్మ చెరువు ఐదు ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుంది. అయితే ఈచెరువు ఇప్పుడు నాలుగు ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురై నేడు ఎకరంన్నర మాత్రమే మిగిలి ఉంది. అధికారుల అజమాయిషి లేకపోవటం ఆక్రమణదారులకు రాజకీయ నేతలు ఆశీస్సులు తోడవటంతో చెరువు గట్టు చుట్టూ ఆక్రమించుకుని ఆక్రమణదారులు పక్కా భవనాలు నిర్మించేసుకున్నారు. అలాగే మాకేంటి అన్నట్టుగా పంచాయతీ చెరువును మెరక చేసి తాపేశ్వరంలో సబ్‌స్టేషన్, ఎంపీపీ పాఠశాల, గుడి, బడి, మార్కెట్ ఇలా అన్ని చెరువును మెరక చేసి నిర్మించేశారు. ఇలా ఇక్కడ చెరువు కొంత కాలానికి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణల నుంచి చెరువును కాపాడాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మండల సమావేశంలో పామర్రు ఆసుపత్రిపై చర్చ

సాదాసీదాగా మండల సమావేశం



పామర్రు ప్రభుత్వాసుపత్రి గురించి ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్

కె.గంగవరం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): పామర్రులో కోటిన్నరతో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ఎప్పుడు వినియోగంలోకి తీసుకువచ్చి వైద్య సేవలందిస్తారని దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన పామర్రులో నిరుపయోగంగా ఆసుపత్రి కథనంపై చర్చ జరిగింది. తొలుత ఈవిషయాన్ని దంగేరు ఎంపీటీసీ లక్ష్మణ్ ప్రస్తావించారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసి వైద్యసేవలు ప్రారంభించాలని కోరారు. దీనిపై ఎంపీడీవో వివరణ ఇచ్చారు. ఆసుపత్రి నిధులు కొంత మేర డీఎంహెచ్‌వో పరిధిలో ఉన్నాయి. వాటి నుంచి విద్యుత్ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఇవ్వాలని ఉన్నతాధికారులకు లేఖ రాశానని, అక్కడ నుంచి వచ్చిన ఆదేశాలతో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. కూళ్ల గ్రామంలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు కోరారు. పంట కాల్వల్లో పూడుకు పోయిన గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు తొలగించాలని సభ్యులు సభలో కోరారు. వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి మాట్లాడుతూ ఖరీఫ్ పంటను విక్రయించే సమయాల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం సొమ్ముతో పాటు, హమాలీ, రవాణా చార్జీలు రైతు ఖాతా లకు జమ చేయించుకోవాలని సూచించారు. మండల ఇంజనీరింగ్ అధికారి ఏసురత్నం మాట్లాడుతూ మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 24 సీసీ రోడ్లను రూ.1.17కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. పలు శాఖల అధికారులు తమ శాఖ ప్రగతిని సభలో వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, జడ్పీటీసీ ఒబిలినేని శ్రీవరలక్ష్మిరాజ్‌కుమార్, తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, ఈవోపీఆర్డీ గౌరీకుమారి, సూపరింటెండెంట్ సురేంద్రరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

పాణింగపల్లిలో పల్లె పండుగ



కె.గంగవరం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): పాణింగపల్లి, సత్యవాడ గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం భూమిపూజ చేశారు.పాణింగపల్లిలో రూ.15లక్షలతో డబ్ల్యూబీఎంరోడ్డు, సత్యవాడలో రూ.16.9లక్షలతో 5సీసీరోడ్లు నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, కూటమినాయులు కొత్తపల్లి మొరార్జీ, బలుసు నాగేంద్ర, చీకట్ల అచ్యుత రామయ్య, తోట వెంకన్న, సలాది ఎర్రిబాబు, సలాది రమేష్, సలాది శ్రీను, తోట ఆదినారాయణ, సలాది బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు ఎం.సీతారామయ్య, సూర్యగౌతమి పాల్గొన్నారు.

'నానోయూరియా, పొటాష్ ఉపయోగాలను రైతులకు తెలపండి'



జొన్నాడలో డీఆర్‌సీ శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న అధికారులు

ఆలమూరు, అక్టోబరు 18: వరిసాగులో తక్కువ ఖర్చుతో ప్రయోజనకరంగా ఉండే వాటిని రైతులకు తెలియజేసి వ్యవసాయం లాభసాటిగా ఉండే విధంగా రైతులను చైతన్యవంతులను చేయాలని వ్యవసాయ సిబ్బందికి జిల్లా అధికారులు సూచించారు. తక్కువ ధరలో లభించే నానో యూరియా, నానో పొటాష్‌లను ఉపయోగించడంవల్ల వ్యయం తగ్గి లాభసాటిగా ఉంటుందన్నారు. ఆలమూరు మండలం జొన్నాడలో శుక్రవారం ఆలమూరు సబ్ డివిజన్‌స్థాయి వ్యవసాయ అధికారులకు డిస్ట్రిక్ట్ రీసోర్స్ సెంటర్ అధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, డాట్ సెంటర్ శాస్త్రవేత్త నందకిశోర్, జిల్లా ఆత్మ పీడీ జ్యోతిర్మయి, డీఆర్‌సీ ఏవో మనోహర్, ఆలమూరు ఏడీఏ రమేష్‌కుమార్ ప్రసంగించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వరిసాగులో వచ్చే తెగుళ్ళ, పైరుపై ఆశించే పురుగులు వాటి ప్రభావం, నివారణచర్యలను వ్యవసాయ సిబ్బందికి వివరించారు. సాధారణ యూరియా, పొటాష్‌కంటే నానో యూరియా, పొటాష్ అదే స్థాయిలో పనిచేస్తాయని ఈ విషయాన్ని రైతులకు వివరించి వాటిని ఉపయోగించేలా చేయాలని సూచించారు. వచ్చే సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన విధివిధానాలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం ఏవోలు లక్ష్మీలావణ్య, ఏసుబాబు, రమేష్‌కుమార్‌తో పాటు సబ్ డివిజన్ స్థాయిలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరిశేషు

కొత్తపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధి కోసం నిర్వహించే మినీ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.హరిశేషు కోరారు. శుక్రవారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలలో వీసీపీ సాఫ్ట్ సొల్యూషన్స్, ఎంసీవీ మోటోకార్ప్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మశీ కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 51 మంది నిరుద్యోగులు హాజరుకాగా పది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించారు. మరో 16 మంది తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ పీవో డాక్టర్ జి.శ్రీనివాసులు, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.రాజేంద్రప్రసాద్, డాక్టర్ కె.అంకమరావు, డాక్టర్ టీసీహెచ్ పాపారావు, వైపీ రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు
ఊబలంక విద్యార్థుల ఎంపిక



క్రీడా పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రావులపాలెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఊబలంక జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం సీహెచ్‌ఎస్‌ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 బాలురు, బాలికల హాకీ, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి హిందూపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. దీంతో పీఈటీ బీవీ రామారావును, ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ కె.లక్ష్మీనరసింహమూర్తి, విద్యాకమిటీ చైర్మన్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు అభినందించారు.

మండపేటలో కోర్టు ఏర్పాటు చేయండి

ఎంపీకి వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు



ఎంపీ పురందేశ్వరికి మండపేటలో కోర్టు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మండపేట, అక్టోబరు,18,(ఆంధ్రజ్యోతి) మండపేట నియోజకవర్గంలో కోర్టు ఏర్పాటుచేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కె.సాయిరాం శుక్రవారం రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థసింగ్‌లను కోరారు. శుక్ర వారం బీజేపీ నేతలు కోన సత్యనారాయణ, గొడవర్తి రామచంద్రరావులు వారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



తహసీల్దార్ తేజేశ్వరరావు

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఈనెల 19నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. 19న మారేడుబాక, 21న ఇప్పనపాడు, 22న వెలగతోడు, 22న వెలగతోడు, 23,26 తేదీల్లో ద్వారపూడి, 24న పాలతోడు, 25న మెర్నిపాడు, 28న జెడ్.మేడపాడు, 29న అర్తమూరు, నవంబరు 1న ఏడిద, 2న తాపేశ్వరం, 4న కేశవరం. గ్రామాల్లో పంచాయతీల వద్ద ఉదయం 10గంటల నుంచి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూసమస్యలు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, జాయింట్ ల్యాంపులు, ఖాతానెంబర్ల తప్పులు, మ్యూటేషన్లు తదితర అంశాలకు సంబంధించి సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

నేడు గంగవరంలో గ్రామసభ

కె.గంగవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నుంచి రీసర్వే సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బండి మృత్యుంజయరావు తెలిపారు. భూముల రీసర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కారానికి దరకాస్తులు చేసుకోవాలన్నారు. 19న విలాస గంగవరం, 21న తామరపల్లి, 22న యర్రపోతవరం, 23న యండగండి, 24న అద్దంపల్లి, 25న పామర్రు, 26న అముజూరు, 28న గంగవరం, 29న కందూరు, 30న పాణింగపల్లి, నవంబరు1న సత్యవాడ, 2న సుందరపల్లి, 4న ఊడిమూడి, 5న కుడుపూరు, 6న కూళ్ల, 7న బాలాంత్రం, 8న శివల, 11న గుడిగళ్ల, 12న భట్లపాలిక, 13న దంగేరు మసకపల్లి, 14న పేకేరు, కోటిపల్లి, 15న కోట గ్రామాల్లో సభలు జరుగుతాయని ఆయన తెలిపారు.

నేడు కారుపల్లిపాడులో గ్రామసభ

పి.గన్నవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుపల్లిపాడులో శనివారం గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. మండలంలో మొట్టమొదటిగా రీసర్వే పూర్తయిన గ్రామం కావడంతో గ్రామసభ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. రైతులు పూర్తి స్థాయిలో హాజరై రీసర్వేపై అభ్యంతరాలుంటే తెలిపాలన్నారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

60 ఉపాధి పనులకు ఆమోదం

ఆలమూరు, అక్టోబరు 18: ఆలమూరు మండలం చొప్పెల్ల పంచాయతీ పరిధిలో ఈ ఏడాది చేపట్టే జాతీయ ఉపాధి హామీ పథకం పనుల కోసం జరిగిన గ్రామసభలో 60 పనులకు ఆమోదం తెలిపారు. సర్పంచ్ దంగేటి చంద్రకళబాపనయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ లావణ్య ఈ పనులను ప్రతిపాదించగా వాటికి ఆమోదం తెలిపి వాటితోపాటు మరికొన్ని పనులు చేపట్టే విధంగా ప్రతిపాదనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మెర్ల గోపాలస్వామి, ఆకుల రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎం.విజయరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.45వేలు

ఆత్రేయపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.45,685 లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

జానపద నృత్యంలో వీకేవీ విద్యార్థుల ప్రతిభ



జానపద నృత్యంలో బహుమతి అందుకుంటున్న వీకేవీ విద్యార్థులు

కొత్తపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యువజన సంక్షేమశాఖ సెట్రాజ్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జానపద గేయం గ్రూపు డ్యాన్సులో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, అధ్యాపకులు వారిని అభినందించారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే నైపుణ్య ప్రదర్శనలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ పెద్దిరాజు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఆలమూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19 నుంచి నవంబరు 5 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన రెవెన్యూ గ్రామసభల వివరాలను వివరించారు. ఈనెల 19న కలవచర్ల, 21న గుమ్మిలేరు, 22న మడికి, 23న మోదుకూరు, 24న నవాబుపేట, 25న పెదపళ్ల, 26న పెనికేరు, 28న పినపళ్ల, 29న బడుగువానిలంక, 30న ఆలమూరు, నవంబరు 1న చింతలూరు, 2న చొప్పెల్ల, 4న నర్సిపూడి, 5న సంధిపూడి గ్రామాలలో సభలు జరుగుతాయన్నారు. నిర్ణయించిన తేదీల ప్రకారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సభలు నిర్వహిస్తున్నట్లు రైతులు ఈ విషయాలను గుర్తించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని తహశీల్దార్ ప్రకాష్‌బాబు కోరారు.

కొనసాగుతున్న ఏజెంట్ల నిరసన

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భారత జీవిత బీమా సంస్థ పాలసీలు, కమీషన్ల విషయంలో తీసుకువచ్చిన మార్పులను నిరసిస్తూ ఎల్‌ఐసీ ఏజెంట్లు చేపట్టిన నిరసన కార్యక్రమం రామచంద్రపురంలో కొనసాగుతోంది. రామచంద్రపురం బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏజెంట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఏజెంట్లు నిరసన తెలిపారు. సేవ్ ఎల్ఐసీ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు రౌతు లక్ష్మీగణేష్, ఎస్‌కేఎం ఎంకే మస్తాన్, పులగం వెంకటరెడ్డి, బి.వి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ద్రాక్షారామ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాపనయ్య చెరువు, నెలపర్తిపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో పద్మజ్యోతి, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, పంచాయతీరాజ్ డీఈఈ భూషన్ ప్రసాద్, ఏఈ యేసురత్నం, కూటమి నాయకులు వల్లూరి సురేష్, మాజీ వైస్ ఎంపీపీ రాయుడు వీర్రాజు, చుండ్రు సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.